క్లుప్తంగా

ఫొటోగ్రఫీ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం సిటీ: శ్రీకాకుళంలో ఈ నెల 8, 9వ తేదీల్లో జరిగే ఫొటోగ్రఫీ ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం ఆవిష్కరించారు. వర్ధమాన ఫొటోగ్రాఫర్లంతా కార్యక్రమంలో పాల్గొనాలని, అందమైన ఫొటోలు తీయడంలో ఉన్న టెక్నిక్ తెలుసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

వైకేపీ ఉద్యోగులకు శిక్షణ

రాజాం: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద స్టార్టప్ విలేజ్ ఎంట్రప్రెన్యూర్స్ ప్రోగ్రాం అమలుపై నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ అసెస్‌మెంట్ హైదరాబాద్ సెంట్రల్ టీం సభ్యులు మిల్లిందు ముఖర్జీ, పశ్చిమబెంగాల్‌కు చెందిన గౌతమ్ మజుందార్‌లు వైకేపీ(వైఎస్సార్ క్రాంతి పథం) ఉద్యోగులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు బిజినెస్ ప్లాన్లు, నిధుల మంజూరు, జీవనోపాధుల పెంపు, పుస్తక నిర్వహణ, రుణాల రికవరీ వంటి అంశాలపై చైతన్యం కలిగించేందుకు బీఆర్‌సీ లీడర్లు, సీఆర్‌పీలు, సీసీలకు ఈ శిక్షణ ఇచ్చినట్లు సమాచారం. కార్యక్రమంలో వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎంలు టి.దధికుమార్, ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని బాగెంపేట, శ్రీహరిపురం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గృహాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

గంటి ప్రసాదంకు ఘననివాళి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో అమరవీరుల బంధుమిత్రుల సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గంటి ప్రసాదం పదో వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇఫ్టు(ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ తదితరులు ప్రసాదం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంలో గంటి ప్రసాదం మంచి దిట్ట అని వక్తలు కొనియాడారు.

రుచి, శుచి తప్పనిసరి



మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూస్తున్న ఎంఈఓ-2 ఎరకయ్య

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎంఈఓ-2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం వండిన వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై విచారణ



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏపీడీ జనార్దనరావు

మెంటాడ: మండలంలోని గుర్లతమ్మిరాజుపేట గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పల్లి సరస్వతి నియామకం చెల్లదంటూ ఇటీవల కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుపై ఏపీడీ జనార్దనరావు విచారణ చేపట్టారు. మంగళవారం గ్రామంలోని సచివాలయం వద్దకు చేరుకుని, ఇరువర్గాలతో మాట్లాడారు. గ్రామంలోని టీడీపీ సర్పంచ్‌కు తెలియకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికార పార్టీకి చెందిన వారు నియమించారని టీడీపీ సభ్యులు ఆరోపించగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం, స్థానికురాలు అయిన సరస్వతిని నియమంచడం తప్పెలా అవుతుందని వైఎస్సార్ సీపీ వర్గం అంటున్నారు. ఇరువర్గాల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్న ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నప్పయ్య, వైఎస్సార్ సీపీ నేత సీహెచ్ సన్యాసినాయుడు, టీడీపీ నేత సీహెచ్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలుతో ప్రజాసంక్షేమం



రేగిడి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: నవరత్నాలు(పథకాలు)తో ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం నాంది పలికిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం మండలంలోని కొమెర గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ఆయన సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. టీడీపీ ఎన్నికలకు ముందు లేనిపోని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తోందని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ కనుమరుగవుతాయని తెలిపారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పి.లక్షుంనాయుడు, ఎంపీటీసీ కె. రామకోటి, రాష్ట్ర పోలేటి వెలమ డైరెక్టర్ కె.సురేష్‌కుమార్, ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి జి.కేశవ పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం..

తెర్లాం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గొలుగువలస గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు వివరించారు. అలాగే ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇక్కడ అమలవుతున్నన్ని పథకాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, సంక్షేమ పాలన కొనసాగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎస్.బాబ్జీరావు, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ జి.లూర్దు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, గొలుగువలస సర్పంచ్ జి.చంద్రవదన శంకరరావు, ఎంపీటీసీ నాగమణి, కొరటాం సర్పంచ్ సీహెచ్ సర్పంచ్ ఉషాశ్రీకాంత్, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే సీఎం జగన్ లక్ష్యం

- జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



జగనన్న అమ్మఒడి పథకం నిధుల చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: విద్య ద్వారా విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ అందివ్వడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న అమ్మఒడి పథకం నిధుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మండలానికి సంబంధించిన జగనన్న అమ్మఒడి చెక్కును విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యపై ఎంత వెచ్చించినా అది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పెట్టుబడి అవుతుందని, కేవలం విద్యతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమని సీఎం జగనన్న బలంగా నమ్ముతున్నారని, అందుకే విద్యారంగం అభివృద్ధికి ఏటా కొన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను కార్పొరేట్‌కు హస్తగతం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతీ పేదవాడికి ఉన్నత విద్యను చాలా సులభతరం చేసిందన్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చి, మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. అలాగే జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద నగదు ప్రోత్సాహకంతో సత్కరించడం మిగతా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతోందన్నారు. చదువుకునేందుకు ఏ విద్యార్థి అయినా, వారి తల్లిదండ్రులైనా ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతోనే ఏటా జగనన్న అమ్మఒడి పథకం కింద విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లులు ఎమ్మెల్యేకు పలు విషయాలపై ఫిర్యాదు చేశారు. జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్నం పాఠశాలల్లోని పిల్లలకు పెట్టే భోజనం బాగోలేదని, రాగిజావలో పురుగులు ఉంటున్నాయని, అలాగే వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీదేవి పిల్లలను ఇష్టానుసారంగా తిట్టడంతో పాటు కొడుతోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. రుచి, శుచితో భోజనం అందివ్వాలని సూచించారు. జగనన్న అమ్మఒడి కార్యక్రమం నిర్వహణపై నిర్లక్ష్యం వహించినందుకు గాను ఎంఈఓ తిరుమలప్రసాద్, హెచ్ఎం కామేశ్వరరావులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యం పనికిరాదని మండిపడ్డారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, రామభద్రపురం బూసాయవలస, రొంపల్లి, ఆరికతోట, కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సచివాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని దుప్పలపూడి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేశారన్నారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్నీ సేవలందుతున్నాయన్నారు. జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏదైనా సంక్షేమ పథకం కోసం గతంలో మాదిరి మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, పాలకేంద్రాలు వంటివి నిర్మిస్తున్నారని, అలాగే వీధుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నారన్నారు. మరోవైపు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. అన్ని వర్గాల వారికి అన్ని విధాలా న్యాయం జరిగేలా పథకాల రూపకల్పన, అమలు జరుగుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం మంచి చేస్తుంటే ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదని విమర్శించారు. ప్రభుత్వాన్ని ఎలా పడగొట్టాలా అనే ఆలోచన తప్ప ప్రజలకు ఇంకా ఏం మంచి చేయాలన్న ఆలోచన టీడీపీ అధినాయకత్వానికి గానీ, నియోజకవర్గాల్లోని ఆ పార్టీ నాయకులకు గానీ లేకపోవడం దారుణమన్నారు. రోజురోజుకూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ జగన్ సర్కారుదే అధికారమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, సర్పంచ్ భాస్కరరావు, పీఆర్ డీఈఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు మాట్లాడుతూ గ్రామకంఠం భూములను కొంతమంది ఆక్రమిస్తున్నారని, ఆక్రమణలు తొలగించే అధికారం రెవెన్యూ శాఖదా, పంచాయతీరాజ్ శాఖదా తెలియజేయాలన్నారు. ఈఓపీఆర్‌డీ రాంబాబు సమాధానమిస్తూ గ్రామకంఠాల ఆక్రమణలను అడ్డుకునే అధికారం రెవెన్యూ శాఖదేనని, ఇదే అంశంపై ఇటీవల రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీపీ జోక్యం చేసుకుని, ఇదే విషయాన్ని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయాలని కోరారు. బొంగుపేట, చీకటిపేట, పెరుమాళి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే పలు గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను ఎంపీపీకి తెలపగా, వారం రోజుల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ జోగినాయుడు అన్నారు. పాలకొండ నుంచి సుందరాడ వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసును ఎస్.బూర్జవలస, బూరిపేట, అప్పలంపేట వరకు నడిపేలా చర్యలు తీసుకోవాలని బూరిపేట సర్పంచ్ మధుసూదనరావు కోరగా, సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేస్తానని సాలూరు ఆర్టీసీ డిపో అధికారి తెలిపారు. ఆమిటి మీదుగా వెళ్తున్న తోటపల్లి పిల్లకాలువకు నాలుగు చోట్ల గండి పడిందని, పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు వరి విత్తనాలు వేసుకోలేకపోతున్నారని ఎంపీటీసీ తెర్లి రమణమ్మ తెలియజేశారు. ఎంపీపీ స్పందిస్తూ గండ్లు పూడ్చేందుకు తోటపల్లి ప్రాజెక్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెర్లాం పీహెచ్‌సీలో గర్భిణీ స్త్రీలకు ప్రసవాలు చేస్తామని, దూరప్రాంతాలకు వెళ్లకుండా పీహెచ్‌సీకి గర్భిణులు ప్రసవాలకు వచ్చేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు కోరారు. వీఓఏలకు జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు వెలుగు ఏపీఎం రామును కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ జి.లూర్దు, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా కార్యక్రమంలో పాల్గొని, మన్యం వీరుడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విప్లవం నా జన్మహక్కు అని తెలుగు నేలపై బ్రిటీషర్లను గర్జించిన విప్లవజ్యోతి సీతారామరాజు అని, దేశ స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: అలజంగిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



రాజాం సిటీ: అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం



బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న సిబ్బంది



తెర్లాం: అల్లూరి జయంతి కార్యక్రమంలో ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ



రేగిడి శాఖా గ్రంథాలయంలో విప్లవ వీరునికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చురుగ్గా 'జగనన్న సురక్ష'

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని గ్రామగ్రామాన జగనన్న సురక్ష కార్యక్రమం చాలా చురుగ్గా జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా మంగళవారం ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వచ్చి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణపత్రాలను ఉచితంగా అందిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



మెంటాడ: మహిళకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర



రాజాం సిటీ: పొనుగుటివలసలో అర్జీదారుకి ఆదాయ ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు



బాడంగి: కోడూరులో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ గౌరి



వంగర: మహిళలకు అవసరమైన ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం



రామభద్రపురం: నాయుడువలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి



రాజాం: లబ్ధిదారునికి ధ్రువీకరణపత్రం అందిస్తున్న అధికారులు



బొబ్బిలి: మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

సంక్షిప్తంగా...

9న ఫ్యాప్టో జిల్లా సదస్సు

రాజాం సిటీ: శ్రీకాకుళం జిల్లాలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన ఫ్యాప్టో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించిన ఆయన పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, జీవో –117ను రద్దు చేయాలని, 11వ పీఆర్‌సీ బకాయిలు తక్షణమే చెల్లించాలన్న అంశాలపై సదస్సులో చర్చించనున్నామన్నారు. సదస్సుకు అందరూ తరలిరావాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గొల్లపల్లి పదో వార్డులో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు. ఆయన వెంట వార్డు ఇన్‌చార్జ్ టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చీకటిపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తెర్లాం: మండలంలోని చీకటిపేటలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ రోగులతో పాటు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పరిశీలించిన పెరుమాళి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్ అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

రేగిడి: పట్టుపురుగుల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని పట్టుపరిశ్రమల శాఖ ఏడీఏ సల్మాన్‌రాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పారంపేట రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడిన ఆయన పట్టు పరిశ్రమ స్థాపన కోసం ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఓ నూకరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు నమ్మొద్దు

రామభద్రపురం: మూఢ నమ్మకాలను నమ్మవద్దని సీఐ తిరుమలరావు కోరారు. మంగళవారం మండలంలోని పాతరేగలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి గ్రామస్తులతో సమావేశమైన ఆయన క్షుద్రపూజలు, చిల్లంగి వంటివి అంతా బూటకమని, వాటి పేరిట ఇతర వ్యక్తులను నిందించడం, తిట్టడం, కొట్టడం చేయకూడదని సూచించారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామానికి చెందిన గార మాణిక్యం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ శాసపు ఈశ్వరరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి, ఆయనకు వృద్ధాప్య పెన్షన్ అందజేశారు. బూరాడకు చెందిన వావిలపల్లి విజయలక్ష్మి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, గ్రామ వలంటీర్ శీర అనీల్‌కుమార్ శ్రీకాకుళం వెళ్లి, మరీ ఆమెకు వృద్ధాప్య పెన్షన్ అందజేశారు.

ఉచితంగా ధ్రువపత్రాల అందజేత

సంతకవిటి: మండలంలోని తలతంపర, గోళ్లవలస గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు అర్హులైన వారికి పథకాలు, అవసరమైన వారికి జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 ధ్రువపత్రాలను ఉచితంగా అందజేసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.దాలినాయుడు, ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'చలో మాదిగ–చలో హైదరాబాద్'

రాజాం: చలో మాదిగ–చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించి, స్థానిక పట్టణంలోని మాదిగ వీధిలో సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్ల నుంచి పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తే ఎస్సీల్లోని ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చలో మాదిగ–చలో హైదరాబాద్ కార్యక్రమ తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు. సమావేశంలో ఆనందరావు, నారాయణరావు, బోస్‌బాబు, చినబాబు, రవికుమార్, పాల్, సునీల్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.